సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 3 । నవంబర్ । 2024




గూడెంలో యువకుడి హత్య

తాడేపల్లిగూడెంలో ఇంటిని శుభ్రం చేసుకుంటున్న సమయంలో మహిళల మధ్య జరిగిన ఘర్షణ ఓ యువకుడి హత్యకు దారి తీసింది. 8లో ▸



ఐదుగురి అరెస్ట్

తాళాలు వేసి ఉన్న ఇళ్లలో పగటి పూటే చోరీలు చేసే దొంగల ముఠాను నూజివీడు సర్కిల్ పరిధిలో పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. 8లో ▸



మన్యంలో ప్రకృతి సోయగాలు

పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో అటవీ అందాలు కనువిందు చేస్తున్నాయి. జలపాతాలు, కొండలను తాకుతున్న మేఘాలు ఆకట్టుకుంటున్నాయి. 8లో ▸

న్యూస్‌రీల్

మద్యం పాలసీ మిథ్య



మాట్లాడుతున్న సీపీఎం కార్యదర్శి బలరామ్

ఆకివీడు: మద్యం పాలసీ ఒక మిథ్య అని, ఇది రాష్ట్ర ప్రజల్ని మోసగించడమేనని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరామ్ ఆరోపించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్త మద్యం పాలసీ కళ్లకు గంతలు కట్టినట్టు ఉందని ఎద్దేవా చేశారు. ప్రజల్ని మరింతగా మద్యం ప్రియుల్ని చేసేలా పాలసీ ఉందన్నారు. ఎక్కడపడితే అక్కడ మద్యం షాపులు వెలుస్తున్నాయన్నారు. అంతటా మద్యం అమ్మకాల జోరు పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మద్యాన్ని ఏరులై పారిస్తుందని, మద్యం పాలసీపై ప్రభుత్వం పునరాలోచించాలని అన్నారు. జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు జేఎన్వీ గోపాలన్ మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం చేస్తే ఊరుకోబోమన్నారు. నాయకులు కె.తవిటినాయుడు, పెంకి అప్పారావు, డోకల లక్ష్మి పాల్గొన్నారు.

బాధితులకు భరోసా


సాక్షి స్పందన

కైకలూరు: చేతబడుల నెపంతో కైకలూరు మండలం చటాకాయ గ్రామంలో ముగ్గురిని చిత్రహింసలకు గురిచేసిన ఘటనపై 'సాక్షి'లో శనివారం 'చటాకాయలో అరాచకం' శీర్షికన ప్రచురించిన కథనంపై ఏలూరు కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ స్పందించారు. బాధితులు రఘు దంపతులకు అధికారులు ఫోన్ చేసి అన్నివిధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పోలీసులు పూర్తిగా సహకరిస్తారని, భయపడవద్దని చెప్పారు. బాధితుడు రఘు తమకు జరిగిన అన్యాయాన్ని వెలుగులోకి తెచ్చిన 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపాడు.

ఇసుక స్టాక్ పాయింట్లపై సమీక్ష

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో ఇసుకను సులభంగా, సౌలభ్యంగా పంపిణీ చేసేందుకు నియోజకవర్గాల వారీగా స్టాక్ పాయింట్లను, ఏజెన్సీలను గుర్తించే చర్యలు వేగవంతం చేయాలని కలెక్టర్ నాగరాణి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మితో కలిసి ఉచిత ఇసుకపై ఆమె సమీక్షించారు. తూర్పుగోదావరి జిల్లా పెరవల్లి మండలం తీపర్రు రీచ్ నుంచి ఇసుకను జిల్లాలోని స్టాక్ పాయింట్లకు చేర్చి ఏజెన్సీల ద్వారా అమ్మకాలు చేపట్టేందుకు ధరలను నిర్ణయించాలన్నారు. ట్రాక్టర్లు, ఎడ్ల బండ్ల ద్వారా ఇసుక తీసుకువెళ్లేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, ఇందుకు సచివాలయంలో ఆన్‌లైన్ బుకింగ్ చేసుకోవాలన్నారు. డీసిల్టింగ్ పాయింట్ల ద్వారా ఇసుకను పొందడానికి బోట్స్‌మెన్ కమిటీలతో మాట్లాడి ధరను నిర్ణయించాలని నరసాపురం ఆర్డీఓను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, ఆర్డీఓలు తదితరులు పాల్గొన్నారు.

ఆకాశ దీపోత్సవం



ఆకాశ దీపాన్ని ఎగురవేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్ర ఉపాలయం, క్షేత్రపాలకునిగా విరాజిల్లుతున్న భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ధ్వజస్తంభం వద్ద అర్చకులు ప్రత్యేక పూజలు చేసి ఆకాశ దీపాన్ని ఎగురవేశారు. శనివారం ఉదయం గర్భాలయంలో శివదేవునికి విశేష అభిషేకాలు చేశారు.

మానసిక వేదనతో ఆత్మహత్య

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా ధర్మాజీగూడేనికి చెందిన షేక్ వలీ (35) గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ తీవ్ర మానసిక వేదనతో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వలీ తాపీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మూడు నెలల క్రితం విజయవాడలో గుండె శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. ఈ క్రమంలో మరోమారు అతడికి శస్త్రచికిత్స చేయాలని వైద్యులు చెప్పడంతో తీవ్ర మనస్తాపంతో శనివారం ఇంట్లో ఉరి వేసుకున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



నరసాపురం : నరసాపురం వలంధర రేవులో వేకువజామున పూజలు చేస్తున్న భక్తులు


● ఓం నమో శివరుద్రాయ

హరోంహర.. శంభో శంకర స్మరణలు మార్మోగాయి. కార్తీకమాసం ప్రారంభం కావడంతో జిల్లావ్యాప్తంగా శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. శనివారం వేకువజామున గోదావరి స్నానాలు ఆచరించి పూజలు చేశారు. జిల్లాలోని పంచారామాలు, పట్టిసీమ క్షేత్రాల్లో విశేష పూజాదికాలు నిర్వహించారు.

- సాక్షి నెట్‌వర్క్



పాలకొల్లు సెంట్రల్ : క్షీరారామంలో దర్శనాలు చేసుకుంటున్న గోవు, భక్తులు



భీమవరం (ప్రకాశం చౌక్) : సోమారామంలో విశేష అలంకరణ

తెరుచుకోని ర్యాంపులు.. తప్పని ఇసుక కష్టాలు

సైకతం.. మరింత భారం

- సీఆర్‌జెడ్ పరిధిలోకి జిల్లాలోని రీచ్‌లు, డీసిల్టేషన్ పాయింట్లు
- గతంలో ఆరు రీచ్‌లు, ఐదు డీసిల్టేషన్ పాయింట్ల ద్వారా తవ్వకాలు
- ఎన్‌జీటీ అనుమతులు రాక మూత
- తెరుచుకోవడం కష్టమేనని వినికిడి
- పొరుగు జిల్లాల ఇసుకే ఆధారం
- రవాణా భారంతోధరలకు రెక్కలు
- మూతపడే దిశగా భీమవరంలో గనుల శాఖ కార్యాలయం



పెనుగొండ మండలం సిద్ధాంతంలో తెరుచుకోని ఇసుక ర్యాంపు

స్టాక్ పాయింట్ కూడా లేదు

జిల్లాలో ఒక్క రీచ్ కూడా లేకపోవడంతో ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాలని భావించినా లోడింగ్, అన్ లోడింగ్ చార్జీల రూపంలో ధర మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నట్టు తెలుస్తోంది.

సాక్షి, భీమవరం: పశ్చిమ గోదావరిలో వరద నీరు లాగినా ఇసుక ర్యాంపులు ఇప్పట్లో తెరుచుకునే దాఖలాలు కనిపించడం లేదు. గతంలోని ఆరు రీచ్‌లు, ఐదు డీసిల్టేషన్ పాయింట్లు కోస్టల్ రెగ్యులేటరీ జోన్ (సీఆర్‌జెడ్) పరిధిలోకి వెళ్లడంతో ఇసుక తవ్వకాలకు బ్రేక్ పడింది. దీంతో గోదావరి చెంతనే ఉన్నా జిల్లావాసులకు ఇసుక అందని ద్రాక్షగా తయారైంది.

ఇప్పట్లో కష్టమే..

ఏటా గోదావరికి వరదల అనంతరం అక్టోబరు, నవంబరు నెలల్లో ర్యాంపులు తెరుచుకునేవి. ఇప్పటికే సమీపంలోని తూర్పుగోదావరి, డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లోని పలు ర్యాంపులకు టెండర్ ప్రక్రియ పూర్తయి వినియోగంలోకి వచ్చాయి. సముద్ర తీరానికి సమీపంలో ఇసుక తవ్వకాలు చేయరాదన్న నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) ఆదేశాల నేపథ్యంలో జిల్లాలోని అన్ని ఇసుక ర్యాంపులు, డీసిల్టేషన్ పాయింట్లు సీఆర్‌జెడ్ పరిధిలోనికి వెళ్లినట్టు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్‌జీటీ, పర్యావరణ తదితర అనుమతులు వచ్చి ఇప్పట్లో ర్యాంపులు తెరుచుకోవడం కష్టమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జిల్లావాసులకు తీరని వెతలు

వరదలు తగ్గితే జిల్లాలోని ర్యాంపులు తెరుచుకుని ఇసుక ధరలు దిగివస్తాయని వినియోగదారులు ఆశించారు. ఇసుక లభ్యతతో చేతినిండా పని దొరుకుతుందని భవన నిర్మాణ రంగం కార్మికులు భావించారు. అయితే ర్యాంపులు ఓపెన్ కాకపోవడంతో యథావిధిగానే వినియోగదారులు పక్క జిల్లాల నుంచి ఇసుక తెచ్చుకోవాల్సి వస్తోంది. ప్రస్తుతం జిల్లాకు తూర్పుగోదావరి జిల్లాలోని కొవ్వూరు నుంచి ఇసుక రవాణా అవుతోంది. 20 టన్నుల లారీ పెనుగొండకు దాదాపు రూ.16 వేలు, పాలకొల్లుకు రూ.20 వేలు, నరసాపురానికి రూ.24 వేలు, భీమవరానికి రూ.28 వేలు, ఆకివీడుకు రూ.30 వేల వరకు ధర ఉన్నట్టు వినియోగదారులు అంటున్నారు. పక్క జిల్లాల్లో ర్యాంపులు తెరుచుకున్నా ఇసుక ధరాభారంతో ఆశించిన స్థాయిలో నిర్మాణ రంగం పుంజుకోలేదని కార్మికులు వాపోతున్నారు. అవరోధాలు వచ్చినప్పుడు జిల్లా అవసరాల దృష్ట్యా గత ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని అనుమతులు తెచ్చి తవ్వకాలు చేసేదని స్థానికులు అంటున్నారు. జిల్లాలో ఇసుక వెతలు తీర్చేందుకు ఆ దిశగా పాలకులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

గతంలో రోజుకు 10 వేల టన్నుల ఇసుక తవ్వకం

గతంలో జిల్లాలోని సిద్ధాంతం-1, 2, కరుగోరుమిల్లి, కోడేరు, నడిపూడి-1, 2 ర్యాంపులు, దొడ్డిపట్ల, అబ్బిరాజుపాలెం, యలమంచిలిలంక, చించినాడ, మాధవాయిపాలెంలోని డీసిల్టేషన్ పాయింట్ల ద్వారా రోజుకు సుమారు పది వేల టన్నుల ఇసుక తవ్వకాలు జరిగేవి. మిగిలిన ర్యాంపుల్లో కంటే సిద్ధాంతం ర్యాంపు నుంచి తవ్వకాలు ఎక్కువగా జరిగేవి. ప్రత్యక్షంగా రెండు వేలు, పరోక్షంగా వేలాది మంది కార్మికులకు ఉపాధి లభించేది. స్థానిక లభ్యతతో దూరభారం తగ్గడంతో రవాణా చార్జీలు కూడా తగ్గి తక్కువ ధరకే ఇసుక జిల్లావాసులకు లభించేది.

మైన్స్ కార్యాలయం ఖాళీ



భీమవరంలో ఖాళీగా ఉన్న గనులు, భూగర్భ శాఖ కార్యాలయం

మైనింగ్ శాఖకు జిల్లాలో ఒక్క లీజు కూడా **లేకపోవడంతో** భీమవరంలోని జిల్లా గనులు, భూగర్భ శాఖ కార్యాలయం కొనసాగింపుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఇటీవల సాధారణ బదిలీల అనంతరం పలు పోస్టులు భర్తీకాని పరిస్థితి. కార్యాలయంలోని అసిస్టెంట్ జియాలజిస్ట్ (ఏజీ), రాయల్టీ ఇన్‌స్పెక్టర్ (ఆర్‌ఐ), టెక్నికల్ అసిస్టెంట్ (టీఏ), డేటా ఎంట్రీ ఆపరేటర్ (డీఏఓ) పోస్టుల్లో ఇంకా ఎవరూ జాయిన్ కాలేదు. మరోపక్క కార్యాలయ సూపరింటెండెంట్ ఇబ్రహీంపట్నంలోని ప్రధాన కార్యాలయానికి, సర్వేయర్ ఏలూరులోని మైన్స్ కార్యాలయానికి డిప్యూటేషన్‌పై వెళ్లారు. ప్రస్తుతం ఇన్‌చార్జి ఏడీ, జూనియర్ అసిస్టెంట్, అటెండర్ ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లాలో ర్యాంపులు తెరుచుకునే అవకాశం లేకపోవడంతో ఇన్‌చార్జి ఏడీ వెంకటేశ్వరరావు త్వరలో ప్రధాన కార్యాలయానికి వెళ్లనున్నారని తెలిసింది. దీంతో ఇక్కడ ఏలూరు జిల్లా అధికారులు ఇన్‌చార్జిగా వ్యవహరించే అవకాశం ఉందని సమాచారం.

పథకాలు చేరువ చేయాలి

జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి రవికుమార్



డీఆర్‌సీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రవికుమార్

భీమవరం: ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు చేరువ చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. శనివారం భీమవరం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా సమీక్షా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఇసుక సౌకర్యవంతంగా అందేలా దృష్టి సారించాలన్నారు. కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేసే బాధ్యత అధికారులుదేనన్నారు. జలవనరులు శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ విధానంలో సాంకేతిక సమస్యలు ఎదుర్కొంటున్నామన్నారు.

ఇసుక కొరతతో ఇబ్బందులు

ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ జిల్లాలో ఇసుక కొరత కారణంగా భవన నిర్మాణాలు నిలిచిపోవడంతో భవన కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలన్నారు. రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించకపోతే త్వరితగతిని పాడైపోయే ప్రమాదముందని నాణ్యతపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తిచేయాలని కోరారు. ఎమ్మెల్యేలు పులపర్తి రామాంజనేయులు, పితాని సత్యనారాయణ, కనుమూరు రఘురామకృష్ణరాజు, ఆరిమిల్లి రాధాకృష్ణ, బొమ్మిడి నాయకర్, బొలిశెట్టి శ్రీనివాస్, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, ఏపీ ఎస్సీపీసీ చైర్‌పర్సన్ పీతల సుజాత, ఎస్పీ నయీం అస్మి, జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

నాడు తప్పు.. నేడు ఒప్పు

- అక్రమమంటూ నాడు భవన నిర్మాణాన్ని అడ్డుకునే యత్నం
- ముఖ్య అతిథిగా నేడు అదే భవనానికి ప్రారంభోత్సవం
- చర్చనీయాంశంగా మారిన గూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి తీరు



నాడు పనులు అడ్డుకునేందుకు ప్రయత్నించి.. ఇటీవల ఎమ్మెల్యే బొలిశెట్టి ప్రారంభించిన భవనం

సాక్షి, భీమవరం: ఈ స్థలం ప్రజల ఆస్తి అన్నారు.. అన్యాక్రాంతం కానివ్వబోనంటూ హడావుడి చేశారు.. అక్రమ నిర్మాణం వెనుక మంత్రి హస్తముందని ఆరోపణలు గుప్పించారు.. కోర్టును ఆశ్రయించి నిర్మాణ పనులు నిలిపేందుకు యత్నించారు.. తీరా చూస్తే.. ఇప్పుడు ముఖ్య అతిథిగా అదే భవనాన్ని ప్రారంభించారు తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్. తాడేపల్లిగూడెంలోని ఎన్టీఆర్ చౌక్ ప్రాంతంలోని శారదా గ్రంథాలయం కాలక్రమంలో చేతులు మారింది. ఈ స్థలాన్ని దక్కించుకున్న వారు రెండేళ్ల క్రితం కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం తలపెట్టారు. పట్టణ ప్రజల కోసం దాతలు గొప్ప ఆశయంతో గ్రంథాలయాన్ని నిర్మించి విరాళంగా ఇచ్చారని, ప్రజల ఆస్తి అయిన ఈ స్థలాన్ని అన్యాక్రాంతం కానివ్వబోమంటూ నాడు ప్రతిపక్ష పార్టీ నేతగా ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అప్పట్లో పెద్ద హైడ్రామానే నడిపారు. విలువైన ఈ స్థలం పరులపరం కావడం వెనుక నాటి మంత్రి కొట్టు సత్యనారాయణ హస్తం ఉందంటూ ఆరోపణలు గుప్పించారు. నిర్మాణ పనులను అడ్డుకునేందుకు 2021లో హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం కూడా వేశారు. ఈ కేసును విచారించిన న్యాయస్థానం దిగువ కోర్టులో అప్పీల్ చేసుకోవాలని సూచించింది. స్థల యజమానులకు వ్యతిరేకంగా దిగువ కోర్టులో కేసు వేసేందుకు బొలిశెట్టి ముందుకు రాకుండా మిన్నకుండిపోవడం గమనార్హం. స్థలం తమదేనని యజమానులు సంబంధిత డాక్యుమెంట్లను కోర్టుకు సమర్పించడంతో వారికి అనుకూలంగా తీర్పు వచ్చింది.

లోగుట్టు ఏమిటో !

ప్రస్తుతం ఆ స్థలంలో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తి కాగా రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ స్వయంగా ప్రారంభించారు. గతంలో భవన నిర్మాణం జరగనివ్వనంటూ అడ్డుకునే ప్రయత్నం చేసిన వారే ఇప్పుడు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావడం వెనుక లోగుట్టు ఏమిటనేది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

దళితుడి హత్యపై నిష్పాక్షిక విచారణ జరపాలి

- ప్రశాంతమైన తణుకులో హత్యలా?
- బెల్టు షాపులతో సంతలో సరుకుగా మద్యం
- మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తణుకు అర్బన్: తణుకులో దళిత వర్గానికి చెందిన కాకర్ల దుర్గారావు హత్య అత్యంత కిరాతకమని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకులో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తణుకు జెడ్పీ హైస్కూల్‌లో దీపావళి దుకాణాల చాటున జరిగిన హత్యలో టీడీపీ నాయకుడి ప్రమేయం ఉందంటూ సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తుండటాన్ని పోలీసు అధికారులు సీరియస్‌గా తీసుకోవాలని కోరారు. హంతకులు ఎంతటి వారైనా నిష్పక్షపాతంగా విచారణ చేయాలన్నారు. కూటమి పాలనలో దళితులపై దాడులు, హత్యలకు పాల్పడుతున్న తీరు బాధాకరమన్నారు. గత టీడీపీ హయాంలో తణుకు నియోజకవర్గంలోని వేల్పూరులో దొంగతనం ఆరోపణలతో ఓ యువకుడిని కొబ్బరి మట్టలతో కొట్టి చంపేశారని, మహిళలపై సైతం ఎన్నో అఘాయిత్యాలకు పాల్పడ్డారని ఆయన గుర్తుచేశారు.

ఏరులై పారుతున్న మద్యం : కూటమి ప్రభుత్వం మద్యాన్ని ఏరులా పారిస్తోందని కారుమూరి మండిపడ్డారు. గత జగన్ ప్రభుత్వంలో నిర్ణీత సమయంలోనే మద్యం విక్రయాలు జరిగేలా నియంత్రించారని, అయితే నేడు కూటమి పాలనలో సంతలో సరుకులా మద్యం విక్రయాలు చేస్తున్నారని, మద్యం దుకాణాలు బార్‌లను తలపిస్తున్నాయని విమర్శించారు. ధరలు తగ్గించకపోగా మద్యం ఎనీటైమ్ అందుబాటులో ఉండటంతో కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

పావలా ఎమ్మెల్యేగా...

ప్రైవేటు మద్యం దుకాణాల్లో పావలా వాటాలతో పావలా ఎమ్మెల్యేగా తణుకులో పేరు ప్రఖ్యాతులు సంపాదించారని, ఇంతకంటే ఘనత ఇంకేముంటుందని కారుమూరి ఎద్దేవా చేశారు. ఇలానే రాష్ట్రవ్యాప్తంగా పావలా వాటాలతో కొందరు ఎమ్మెల్యేలు పిలిపించుకునే పరిస్థితి వచ్చిందన్నారు. సూపర్ సిక్స్ అమలు ఏమైందని ప్రభుత్వాన్ని నిలదీశారు. 'తల్లికి వందనం' పథకం అమలుకాకపోయినా తండ్రికి 'ఇంధనం' మాత్రం విచ్చలవిడిగా అందిస్తున్నారని దుయ్యబట్టారు. ఈవీఎంల ద్వారా గెలిచిన కూటమి నేతలు అబద్ధాలతో ప్రజలను మోసగించారని, ల్యాండ్ టైటిల్‌పై నానా రాద్ధాంతం చేసి ఇప్పుడు మీరు అదే విధానాన్ని కొనసాగించడం లేదా అని నిలదీశారు. ఏడాదికి మూడు గ్యాస్ బండలు ఉచితం అని హామీ ఇచ్చి ఇప్పుడు షరతులు వర్తిస్తాయనడం దారుణమని కారుమూరి అన్నారు.

ఆత్మీయ సమావేశం.. అసంతృప్తులే అధికం

భీమవరంలో ఎన్‌డీఏ జిల్లా సమావేశం



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి రవికుమార్. వేదికపై కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ తదితరులు

భీమవరం: భీమవరంలో శనివారం నిర్వహించిన ఎన్‌డీఏ కూటమి ఆత్మీయ సమావేశంలో నేతల మధ్య అసంతృప్తులే అధికంగా కనిపించాయి. టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, మంత్రి నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎక్కడా ప్రొటోకాల్ పాటించడం లేదని జనసేన నేతలు, కార్యకర్తలు సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. జనసేనను పోలీసులు, అధికారులు, చివరకు మీడియా కూడా తొక్కేయాలని చూస్తోందని తెలిపారు. నామినేటెడ్ పోస్టుల భర్తీలో జనసేన నేత కొణిదెల నాగబాబు చెప్పినట్టు టీడీపీ ఎమ్మెల్యేలు గెలిచిన చోట్ల టీడీపీకి 60 శాతం, జనసేనకు 30 శాతం, బీజేపీకి 10 శాతం పదవులు, జనసేన ఎమ్మెల్యేలు గెలిచిన చోట్ల జనసేనకు 60 శాతం, టీడీపీకి 30 శాతం, బీజేపీకి 10 శాతం పదవులు ఇచ్చే విధానంలో స్పష్టత ఇవ్వాలని జనసేన పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ సభ్యుడు వేగేశ్న కనకరాజు సూరి డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణా సంఘం చైర్మన్ పాకా సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి పాలనలో మద్యం, ఇసుక పాలసీలతో ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ఎమ్మెల్యేలు పులపర్తి రామాంజనేయులు, బొమ్మిడి నాయకర్, బొలిశెట్టి శ్రీనివాస్, కె.రఘురామకృష్ణరాజు, ఆరిమిల్లి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సహస్ర దీపాలంకరణ సేవ ట్రయల్ రన్



మండపంలో దీపాలు వెలిగిస్తున్న సిబ్బంది

ద్వారకాతిరుమల : నూతనంగా ప్రవేశపెడుతున్న శ్రీవారి సహస్ర దీపాలంకరణ సేవకు అధికారులు శనివారం రాత్రి ట్రయల్ రన్ వేశారు. స్వామి వారి నిత్యకళ్యాణ మండపం ప్రాంతంలో దాత పీపీ రాజుచే ఈ మండపాన్ని నిర్మించారు. దీన్ని ఈ నెల 9న ప్రారంభించనున్నారు. స్వామి, అమ్మవార్లు ఊగేందుకు ఉయ్యాలను ఏర్పాటు చేయడంతో పాటు దీపాలను సిబ్బంది వెలిగించారు. దీపపు కాంతుల్లో స్వామి, అమ్మవార్లతో ఉయ్యాల ఊగే ఈ సేవ ట్రయల్ రన్ వేశారు. టీటీడీ తరహాలో సేవ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

శ్రీవారి క్షేత్రం భక్తజన సంద్రం

శ్రీవారి దివ్య క్షేత్రం వేలాదిగా తరలివచ్చిన భక్తులతో కళకళలాడాయి. తూర్పు రాజగోపుర ప్రాంతంలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూ లైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండన శాల ఇతర విభాగాలు భక్తులతో కిక్కిరిశాయి. పలు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు అలరించాయి. సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది.

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు కాస్‌టెక్‌లో కొలువులు



విద్యార్థులతో డైరెక్టర్ అమరేంద్రకుమార్

నూజివీడు: స్థానిక ట్రిపుల్ ఐటీలో ఎంఎంఈ బ్రాంచి ఫైనల్ ఇయర్ విద్యార్థులు పలువురు హైదరాబాద్‌కు చెందిన కాస్‌టెక్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరు మొదటి 6 నెలలు ఇంటర్న్‌షిప్ ద్వారా తర్ఫీదు పొందుతారు. ఈ సమయంలో నెలకు రూ.15 వేల స్టైఫండ్ అందిస్తారు. ఇంటర్న్‌షిప్ తరువాత ఉద్యోగాలు ఇస్తారు. ఎంపికైన విద్యార్థులను డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్, అధ్యాపకులు అభినందించారు. మెటలర్జీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచి ఉద్యోగాలు పొందారని అమరేంద్రకుమార్ తెలిపారు. దేశంలో మెటలర్జీ రంగంలో అనేక అవకాశాలున్నాయని, అయితే ఉద్యోగుల కొరత ఉందని హెచ్‌ఓడీ బి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. విద్యార్థులను డైరెక్టర్‌తో పాటు అధ్యాపకులు అభినందించారు.

వివాహిత అదృశ్యం

పోలవరం రూరల్: వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపారు. పోలవరం మండలం గూటాల గ్రామానికి చెందిన దుర్గకు, పొన్నూరి ఆంజనేయులతో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. గత నెల 26 నుంచి దుర్గ కనిపించడం లేదని, ఆమె భర్త ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

పచ్చని మన్యం.. ప్రకృతి సోయగం

- జిల్లాలో కార్తీక మాస సందడి
- విహారయాత్రకు అనుకూల కాలం
- గోదావరి నదిపై ప్రారంభమైన బోటు ప్రయాణాలు



గోదావరి నదిపై ప్రయాణిస్తున్న బోటు



ఇసుక తిన్నెలపై యాత్రికుల కోసం ఏర్పాటు చేసిన కాటేజీలు

బుట్టాయగూడెం: కార్తీకమాసం అంటే భక్తితో పూజలు చేయడమే కాదు.. పర్యాటకుల సందడి కూడా ఉంటుంది. పిక్‌నిక్‌ల పేరుతో వివిధ ప్రాంతాలకు వెళ్లాలని అంతా ఆరాటపడుతుంటారు. కార్తీకమాసం ప్రారంభం కావడంతో దైవ దర్శనాలతో పాటు పిక్‌నిక్‌ల పేరుతో పర్యాటక ప్రాంతాలను చూసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో అందమైన, ఆహ్లాదకరమైన ప్రదేశాలతోపాటు ఆలయాలవైపు ఒక లుక్కేద్దాం.

అటవీ అందాలు

పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో అటవీ అందాలు చూపరులను కనువిందు చేస్తున్నాయి. జాలువారుతున్న జలపాతాలు, కొండలను తాకుతున్న మేఘాలు, ప్రకృతి రమణీయ దృశ్యాలు మనసును దోచుకుంటున్నాయి. ఏజెన్సీ ప్రాంతంలో జలపాతాలు పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తున్నాయి. పచ్చని చీరను కప్పుకున్న అడవితల్లి అందం అడుగడుగునా తొనికిసలాడుతూ చూపరుల మదిని దోచుకుంటుంది. జల్లేరు జలాశయం, ముంజులూరులోని ఏనుగుతోగు జలపాతం, గుబ్బల మంగమ్మ సన్నిధి, పోగొండ రిజర్వాయర్‌తో పాటు అటవీ ప్రాంతంలోని పలు ప్రదేశాలు పిక్‌నిక్ స్పాట్‌లుగా ఉన్నాయి. ప్రతిఏటా కార్తీకమాసంలో లక్షలాది మంది పర్యాటకులు ఆయా ప్రాంతాల్లో వన భోజనాలు ఏర్పాటు చేసుకుంటూ ఆనందంగా గడుపుతారు. ఈ ఏడాది ఆయా ప్రాంతాల్లో కూడా పిక్‌నిక్‌ల సందడి ప్రారంభమైంది.



ముంజులూరు వద్ద ఉన్న ఏనుగుతోగు జలపాతం



పట్టిసీమ శివ క్షేత్రం



ఉప్పరిల్ల వద్ద ప్రవహిస్తున్న నీరు

గోదావరి విహారం

కార్తీకమాసం వచ్చిందంటే పాపికొండల యాత్రకు వెళ్లేవారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. గోదావరి తీర ప్రాంతాలతో పాటు పాపికొండల విహారానికి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివస్తుంటారు. ముఖ్యంగా శని, ఆదివారాల్లో రాష్ట్రంతో పాటు తెలంగాణ ప్రాంతాల నుంచి యాత్రికుల తాకిడి అధికంగా ఉంటుంది. ఈ ఏడాది అత్యధిక వర్షాలు కురిసి గోదావరి వరద కూడా ఉధృతంగా ప్రవహించడంతో బోటు ప్రయాణాలను పర్యాటక శాఖ నిలిపివేసింది. అయితే గోదావరి తగ్గు ముఖం పట్టడం, కార్తీకమాసం ప్రారంభమైన నేపథ్యంలో పర్యాటక శాఖ తిరిగి పాపికొండల విహార యాత్రను ప్రారంభించింది. కార్తీక మాసంలో పర్యాటకుల కోసం దేవీపట్నం మండలం గండి పోచమ్మ ఘాట్ నుంచి పాపికొండల విహార యాత్రకు 12 బోట్లు అందుబాటులో ఉంచినట్టు అధికారులు చెబుతున్నారు.

సందర్శన స్థలాలు

పాపికొండల విహారయాత్రలో ఇసుక తిన్నెలపై కొలువైన పోలవరం మండలం పట్టిసీమ వీరభద్ర స్వామి, మహానందీశ్వర స్వామి ఆలయాలు, అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలంలో గండిపోచమ్మగుడి, బ్రిటిష్ కాలపు పోలీస్ స్టేషన్, 11వ శతాబ్దం నాటి ఉమాచోడేశ్వర స్వామి ఆలయం, కొరుటూరులో అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్మించిన కాటేజీలు, పేరంటాలపల్లి ఆశ్రమాన్ని సందర్శించి అక్కడ శివుడిని దర్శించుకోవచ్చు. గోదావరి వెంబడి ఇరువైపులా గట్లపై దర్శనమిచ్చే గిరిజన గ్రామాల్లోని ఇళ్లు పర్యాటకులను కనువిందు చేస్తాయి. పోలవరం ప్రాజెక్టు కూడా పర్యాటకుల మనస్సు దోచుకుంటుంది. గోదావరి నదిపై నిర్మించిన ఈ ప్రాజెక్టును తిలకించేందుకు వేలాది మంది పర్యాటకులు వస్తుంటారు.

ఆంధ్రుల జీవనాడి

ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టు పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకుంటోంది. ప్రాజెక్టు పూర్తయ్యి టూరిస్ట్ హబ్‌గా అభివృద్ధి పరిస్తే ప్రపంచ స్థాయి పర్యాటకుల్ని ఆకర్శిస్తాయని ప్రకృతి ప్రేమికులు పేర్కొంటున్నారు. పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో అందాలను తిలకించేందుకు పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తుంటారు. ఈ కార్తీకమాసంలో ఆయా ప్రదేశాల్లో వన సమారాధనల ఏర్పాటుకు పర్యాటకులు సన్నాహాలు చేసుకుంటున్నారు.

గుహలో కొలువైన గుబ్బల మంగమ్మతల్లి

చుట్టూ పచ్చని కొండలు, ఆహ్లాదకరమైన వాతావరణం ప్రపంచ ప్రసిద్ధి గాంచిన సుందర సోయగాల సమాహారం పర్యాటకులను మైమరపింపజేసే ప్రకృతి సోయగాల కలపోత గుబ్బల మంగమ్మ తల్లి దర్శనం. బుట్టాయగూడెం మండలంలో కామవరం సమీపంలో అందమైన అడవిలో ఎత్తైన కొండలు, కనువిందు చేస్తూ గలగల పారే సెలయేర్ల సవ్వడుల నడుమ ఆహ్లాదాన్ని పంచే ప్రాంతంలో గుహలో కొలువై భక్తుల పూజలు అందుకుంటోంది గుబ్బల మంగమ్మతల్లి. మంగమ్మ తల్లి దర్శనానికి వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. కార్తీకమాసంలో కూడా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు, పర్యాటకులు ఈ ప్రాంతానికి వస్తుంటారు. ఇటు ఆధ్యాత్మికంగా, అటు పర్యాటక కేంద్రంగా ప్రకృతి ప్రేమికుల మనసులు దోసుకుంటాయి.

గూడెంలో యువకుడి హత్య



మనబాల రాజేష్ మృతదేహం



రాజేష్ ఇంటి పక్క పోర్షన్ వద్ద రక్తపు మరకలను పరిశీలిస్తున్న సీఐ సుబ్రహ్మణ్యం, క్లూస్‌టీమ్

తాడేపల్లిగూడెం అర్బన్ : తాడేపల్లిగూడెం పట్టణంలో ఇంటిని శుభ్రం చేసుకుంటున్న సమయంలో మహిళల మధ్య సంభవించిన ఘర్షణ ఒక యువకుడి హత్యకు దారి తీసింది. పట్టణ సీఐ ఎ.సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మనబాల రాజేష్ (35) భార్య జ్యోతి, ఇద్దరు పిల్లలతో తాడేపల్లిగూడెం 4వ వార్డులోని ఒక ఇంటి పోర్షన్‌లో పదేళ్లుగా నివాసం ఉంటున్నాడు. రాజేష్ పెయింటర్‌గా జీవనం సాగిస్తున్నాడు. రాజేష్ పక్క పోర్షన్‌లో ఆరు నెలలుగా నిడదవోలుకు చెందిన లక్ష్మి అనే మహిళ అద్దెకు ఉంటోంది. లక్ష్మి అల్లుడు శ్రీను గూడెంలోని ఒక హోటల్‌లో పనిచేస్తూ నెల రోజులుగా ఆమె వద్దనే ఉంటున్నాడు. దీపావళి సందర్భంగా అక్టోబరు 30న రాజేష్ భార్య జ్యోతి ఇంటిని శుభ్రం చేసుకుంటున్న సమయంలో లక్ష్మితో వాగ్వివాదం ఏర్పడి కొద్దిసేపటికి సద్దుమణిగింది. నవంబరు 1వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో రాజేష్ ఇంటికి వచ్చి మొక్కలకు నీరు పోసి ఇంటిలో నిద్రకు ఉపక్రమించాడు. ఈలోగా, రాత్రి 12 గంటల సమయంలో పక్క పోర్షనులో ఉన్న లక్ష్మి వచ్చి జ్యోతిని నిద్రలేపి రాజేష్ ఇంటి ముందు పడిన్నాడని చెప్పింది. జ్యోతి అక్కడకెళ్లి చూడగా, తన భర్త రాజేష్ రక్తపు మడుగులో పడిఉన్నాడు. కొన ఊపిరతో ఉన్న రాజేష్‌ను ఇరుగుపొరుగువారి సాయంతో స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా, అప్పటికే రాజేష్ మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. రాజేష్ ఎడమ చెవి తెగిపోయి, తలపై తీవ్రగాయమై, మెడ వద్ద కత్తి గాటు ఉంది. డీఎస్పీ డి.విశ్వనాథ్, సీఐ సుబ్రహ్మణ్యం తన సిబ్బందితో ఘటనా స్థలంలో పరిశీలన చేశారు. భీమవరం క్లూస్‌టీం ఎస్సై రాజేష్ పోలీసు జాగిలం క్లోరితో ఘటనా స్థలిలో శోధించారు. పోలీసు జాగిలం క్లోరి లక్ష్మి పోర్షన్ వెనుకవైపునకు వెళ్లి ఆగిపోయింది. పట్టణ సీఐ ఎ.సుబ్రహ్మణ్యం, పెంటపాడు ఎస్సై కేసీహెచ్ స్వామిలు స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం రాజేష్ బంధువులకు అప్పగించారు.

పగటి పూటే చోరీలు.. ఐదుగురి అరెస్ట్

- రూ.44.20 లక్షల చోరీ సొత్తు స్వాధీనం
- ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శివకిషోర్



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు, వెండి వస్తువులతో అధికారులు

ఏలూరు టౌన్ : పట్టపగలు రెక్కీ చేస్తారు. ఇంటికి తాళాలు వేయటం చూశారంటే. పక్కాగా ప్లాన్ చేస్తారు. ఇంటి పరసరాల్లో ఎవరూ లేరని పరిశీలిస్తారు. ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లోని బీరువాలను ఇనుపరాడ్లతో కొట్టి తెరుస్తారు. నగదు, బంగారు ఆభరణాలు, వెండి, విలువైన వస్తువులు కాజేసి ఉడాయిస్తారు. ఇలాంటి దొంగల ముఠా సభ్యులను ఏలూరు జిల్లా నూజివీడు రూరల్ సర్కిల్ పరిధిలో పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. భారీ ఎత్తున బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను, మోటారు సైకిళ్లు, నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ శనివారం విలేకర్లకు వెల్లడించారు. నూజివీడు రూరల్, చాట్రాయి పోలీస్ స్టేషన్ పరిధిలో సుమారు 590 గ్రాముల బంగారు ఆభరణాలు, 1630 గ్రాముల వెండి వస్తువులు, మూడు మోటారు సైకిళ్లు, రూ.60 వేలు రికవరీ చేశారు. ఐదుగురు దొంగల ముఠా సభ్యులు ఏలూరు, ఎన్‌టీఆర్ జిల్లా, తెలంగాణలోని ఖమ్మం జిల్లా వేంసూరు మండలంలో చోరీలకు పాల్పడినట్టు గుర్తించారు. వీరిపై 28 చోరీ కేసులు నమోదయ్యాయి. చింతలపూడి పట్టణం కొప్పులవారి గూడెంకు చెందిన కొప్పుల నాగపుల్లారావు, ప్రస్తుతం చింతలపూడిలో నివసిస్తున్న ఖమ్మం జిల్లా అశ్వారావుపేటకు చెందిన బేలూరి హిమకర్ అలియాస్ చైతన్య, కృష్ణాజిల్లా బాపులపాడు మండలం మడిచర్లకు చెందిన భూక్యా తరుణ్, అజ్మీర నవీన్, తల్లిబోయిన దుర్గారావు అనే వ్యక్తులను అరెస్ట్ చేశారు. వీరి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నూజివీడు రూరల్ సీఐ కె.రామకృష్ణ, నూజివీడు రూరల్ ఎస్సై ఎస్.లక్ష్మణబాబు, చాట్రాయి ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీస్ బృందాలు దొంగలను చాకచక్యంగా పట్టుకున్నారు. చాట్రాయి ఏఎస్సై గజపతి, హెచ్‌సీ ఎం శ్రీనివాసరావు, విజయ భాస్కర్, జి.శ్రీను, కానిస్టేబుల్స్ వెంకటేశ్వరరావు, నాగయ్య, గిరి, విష్ణు, అశోక్, శ్రీనివాస్, నూజివీడు రూరల్ స్టేషన్ కానిస్టేబుల్స్ వాసుదేవరావు, ఆలీ, ఉదయ్‌కిరణ్, చక్రవర్తి, భోగేశ్వరరావును ఎస్పీ శివకిషోర్ ప్రత్యేకంగా అభినందిస్తూ ప్రశంసా పత్రాలు అందజేశారు. సమావేశంలో ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, నూజివీడు డీఎస్పీ కేవీవీఎస్‌వీ ప్రసాద్ ఉన్నారు.

యువతి పొట్టలో కిలోన్నర జుట్టు



యువతి కడుపులో పేరుకుపోయిన జుట్టు

ఏలూరు రూరల్ : ఓ యువతి కడుపులో కిలోన్నర జుట్టు బయటపడింది. వెంట్రుకలు తినే అలవాటు వల్లే కడుపులో జుట్టు పేరుకుపోయిందని వైద్యులు నిర్ధారించారు. కొల్లేరు గ్రామానికి చెందిన యువతి (25) కొద్దికాలంగా ఆహారం తీసుకునేందుకు ఇబ్బంది పడుతూ, వాంతులు చేసుకుంటూ అనారోగ్య సమస్యతో ఆశ్రం ఆసుపత్రిలో చేరింది. గ్యాస్ట్రో విభాగం వైద్యుడు టీవీ కృష్ణవర్దన్ ఆమెకు అల్ట్రా సౌండ్, సిటీ స్కానింగ్‌తో పాటు ఎండోస్కోపీ పరీక్షలు నిర్వహించగా పొట్టభాగంలో తల వెంట్రుకలు వెలుగుచూశాయి. ల్యాపరోస్కోపీ ద్వారా ఆధునిక పద్ధతిలో పొట్ట భాగంలో చిన్న గాట్లు పెట్టి ఉండలుగా పేరుకుపోయిన వెంట్రుకలను బయటకు తీశారు. ఆపరేషన్ లేకుండా ఆధునిక విధానంలో విజయవంతంగా చికిత్స చేసిన వైద్య బృందం లావణ్య, హర్ష, దివ్య, స్టాఫ్‌ను ఆశ్రం సీఈఓ కె.హనుమంతురావు అభినందించారు.

11 నుంచి సీనియర్స్ నేషనల్ టెన్నిస్ పోటీలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆధ్వర్యంలో నేషనల్ టెన్నిస్ పోటీలు నిర్వహించనున్నట్టు క్లబ్ అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు తెలిపారు. శనివారం స్థానిక క్లబ్ ప్రాంగణంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. సీహెచ్ బుద్దావతారం రాజు మెమోరియల్ నేషనల్ సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నమెంట్ ఈ నెల 11 నుంచి 17 వరకు కొనసాగుతుందని చెప్పారు. సీనియర్స్ విభాగంలో 45, 55, 65, 70, 75 సింగల్స్, డబుల్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు. క్రీడాకారులు 5వ తేదీలోపు తమ పేర్లు నమోదు చేయించుకోవాలని, 6వ తేదీన విత్‌డ్రా చేసుకోవచ్చని చెప్పారు. సింగిల్స్‌కు రూ.800, డబుల్స్‌కు రూ.1000 ఎంట్రీ ఫీజులు చెల్లించాలన్నారు. ఈ టోర్నమెంట్‌లు పాలకొల్లు కాస్మోక్లబ్, టౌన్ హాలు, నరసాపురం ఆఫీసర్స్ క్లబ్ గ్రౌండ్లలో నిర్వహిస్తామని తెలిపారు. 45, 70, 75 వయస్సు గల క్రీడాకారులు సెల్ నెంబర్ 98857 50999, అలాగే 55, 65 వయస్సు గల క్రీడాకారులు సెల్ నెంబర్ 94916 66789లో సంప్రదించాలని కోరారు. రాబోయే రోజుల్లో స్టేట్ అండ్ నేషనల్ విభాగాల్లో షెటిల్ టోర్నమెంట్ నిర్వహిస్తామని వెల్లడించారు. సమావేశంలో సెక్రటరీ వీవీ సోమరాజు, సత్యనారాయణరాజు, టోర్నమెంట్ ఆర్గనైజర్ బూన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఫిషర్‌మెన్ సొసైటీ ఎన్నికల్లో విధ్వంసం

మండవల్లి/కైకలూరు: ఓటమి తప్పదనే భయంతో కూటమి నేతలు మండవల్లి మండలం తక్కెళ్లపాడులో శనివారం విధ్వంసం సృష్టించారు. గ్రామ ఫిషర్‌మెన్ కో ఆపరేటివ్ సొసైటీ ఎన్నికల్లో రెండు వర్గాల మధ్య విబేధాలు భగ్గుమన్నాయి. ఫెజ్–1లో ఎన్నికల నిర్వహించాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాలు ఇచ్చారు. ఫిషరీస్ అధికారులు ఎన్నిక నిర్వహణకు సర్వంసిద్ధం చేశారు. కోరం గెలవలేమనే అనుమానం వచ్చిన కూటమి నాయకులు నామినేషన్లు మధ్యాహ్నం 12 గంటల వరకు వైఎస్సార్ సీపీ సానుభూతిపరులతో వేయనీయలేదు. దీంతో ఎన్నికల అధికారి సతీష్ ఉదయం 11 గంటల వరకే నామినేషన్లు వేయాలని, ఎన్నికను వాయిదా వేస్తున్నామని ప్రకటించారు. సొసైటీ ఓట్లు లేనివారు సైతం గొడవలకు దిగుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. రూరల్ సర్కిల్ సీఐ వి.రవికుమార్ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలతో తిరిగి ఎలక్షన్ నిర్వహిస్తామని చెప్పారు. గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

పేలుడు ఘటనలో మరొకరు మృతి



విప్పర్తి వెంకటేశ్వరరావు (ఫైల్)

తణుకు: తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెం ఇటీవల సంభవించిన బాణసంచా పేలుడు ఘటనలో మృతుల సంఖ్య మూడుకు చేరింది. ఇరగవరం మండలం కావలిపురం గ్రామానికి చెందిన విప్పర్తి వెంకటేశ్వరరావు (56) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. గ్రామంలో బుధవారం సాయంత్రం బాణసంచా తయారీ కేంద్రంపై పిడుగు పడిన ఘటనలో ఇద్దరు దువ్వ గ్రామానికి చెందిన వేగిరోతు శ్రీవల్లి, పెంటపాడు మండలం రావిపాడు గ్రామానికి చెందిన గుమ్మడి సునీత ఘటనా స్థలంలోనే మృతి చెందగా తీవ్రంగా గాయపడిన అయిదుగురిని చికిత్స నిమిత్తం ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. 90 శాతం కాలిన గాయాలతో కడిమి కుమారి (దువ్వ), చుక్కా పెద్దింట్లు (దువ్వ), మండలంక కమలరత్న (రావిపాడు), శీలం లక్ష్మి (రావిపాడు) చికిత్స పొందుతున్నట్టు ఉండ్రాజవరం ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు.

20 రోజుల క్రితమే అల్లుడు మృతి

కావలిపురానికి చెందిన విప్పర్తి వెంకటేశ్వరరావు గత కొన్నేళ్లుగా బాణసంచా తయారీ కేంద్రంలో పని చేస్తున్నారు. సీజన్ పూర్తయ్యాక ఇటుకల బట్టీలో పని చేస్తుంటారు. వెంకటేశ్వరరావు, కుమారి దంపతులకు కుమారుడు ఆనంద్, కుమార్తె. కాగా కుమార్తె లక్ష్మీశోభకు గొల్లపల్లి సురేష్‌తో వివాహం చేశారు. 20 రోజుల క్రితమే అల్లుడు సురేష్ గుండె పోటుతో మృతి చెందారు. కుమారుడు, కోడలు దివ్యాంగులు కాగా పుట్టిన ఇద్దరు పిల్లలకు కూడా మాటలు రాకపోవడం విచారకరం. ఈ పరిస్థితుల్లో వెంకటేశ్వరరావు కూలీ పనులు చేసుకుంటూ మొత్తం ఆ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. కుటుంబంలో పెద్ద దిక్కుగా ఉన్న వెంకటేశ్వరరావును కోల్పోవడంతో కుటుంబం రోడ్డున పడింది.

హత్య కేసులో వీడని మిస్టరీ



హత్యాస్థలిలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం (ఫైల్)

తణుకు: పట్టణంలో శుక్రవారం జరిగిన హత్య ఘటనలో ఇంకా మిస్టరీ వీడలేదు. సజ్జాపురం ప్రాంతానికి చెందిన కాకర్ల దుర్గారావు (35)ను గుర్తు తెలియని వ్యక్తులు కొట్టి చంపిన విషయం తెలిసిందే. శుక్రవారం తెల్లవారుజామున స్థానిక బాలుర హైస్కూల్ ఆవరణలో దుర్గారావుపై విచక్షణా రహితంగా దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ కేసులో పోలీసులు ఏడుగురు అనుమానితులను విచారించారు. మరోవైపు టీడీపీ స్థానిక నేత హస్తం ఉందంటూ సోషల్ మీడియాలో వస్తోన్న ప్రచారంపైనా పోలీసులు దృష్టిసారించినట్టు తెలుస్తోంది.

ఉద్దేశపూర్వకంగా చేశారా?

తణుకు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మూడు రోజుల పాటు దీపావళి బాణసంచా విక్రయాలు నిర్వహించారు. గ్యాస్ సిలిండర్లను ఇంటింటికీ సరఫరా చేసే కాకర్ల దుర్గారావు చివరి రోజైన గురువారం మధ్యాహ్నం అక్కడే ఉండి దుకాణదారులను డబ్బులు అడిగాడని, పూటుగా మద్యం సేవించి ఉన్నాడని స్థానికులు చెబుతున్నారు. శుక్రవారం తెల్లారేసరికి దుకాణాల వెనుక హత్యకు గురికావడం అనుమానాలకు తావిస్తోంది. దుర్గారావును ఉద్దేశపూర్వకంగా హత్య చేశారా? లేక మరేదైనా కారణమా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అప్పుడప్పుడు చేతివాటం చూపించే దుర్గారావు బాణసంచా దుకాణాల వద్ద ఉన్న జనసందోహంలో ఏదైనా దొంగతనానికి ప్రయత్నించిన క్రమంలో ఎవరైనా దాడి చేశారా? అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. మరోవైపు భార్య అలివేలు మంగతాయారుతో విభేదించి దూరంగా ఉంటున్న క్రమంలో మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని తెలుస్తోంది. ప్రస్తుతం భార్య ఉండ్రాజవరంలోని పుట్టింట్లో ఉంటోంది.

పని చేయని సీసీ కెమెరాలు

దుర్గారావుపై హత్య జరిగిన ప్రాంతంలో పాఠశాల సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ స్టోరేజీ లేకపోవడం గమనార్హం. సీసీ కెమెరాలు పని చేసుంటే ఇప్పటికే దర్యాప్తు ఓ కొలిక్కి వచ్చేది. హైస్కూల్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. గతంలో ఇక్కడ ఎప్పుడూ ఇలాంటి ఘటన చోటు చేసుకోలేదు. సాధారణ రోజుల్లో రాత్రి సమయాల్లో హైస్కూల్ ఆవరణలోకి ఎవ్వరూ వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకునే వారు. అయితే బాణసంచా దుకాణాలు ఏర్పాటుతో సరైన పర్యవేక్షణ లేకపోవడం తాజా ఘటనకు అద్దం పడుతోంది.

యువకుడిపై పోక్సో కేసు

కైకలూరు: బాలికకు పెళ్లి చేసుకుంటానని లైంగికదాడికి ప్రయత్నించిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు కైకలూరు టౌన్ ఎస్సై డి.వెంకట్‌కుమార్ శనివారం తెలిపారు. కైకలూరు మండలం వింజరం గ్రామానికి చెందిన బొద్దుల సుగుణరావు (23) డిగ్రీ పూర్తి చేసి క్యాటరింగ్ పనులకు వెళుతున్నాడు. కైకలూరు టౌన్‌లో బాలికను వివాహం చేసుకుంటానని శుక్రవారం తీసుకెళ్లి లైంగికదాడికి యత్నించాడు. బాలిక కేకలు వేయడంతో పరారయ్యాడు. తల్లిదండ్రులకు జరిగిన విషయాన్ని చెప్పింది. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కేసును 24 గంటల్లో చేధించిన ఎస్సై, సిబ్బందిని సీఐ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

జంగారెడ్డిగూడెం: కారును లారీ ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందినట్టు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. మండలంలోని తాడువాయికి చెందిన గారపాటి శ్రీను తాడువాయి షుగర్ ఫ్యాక్టరీలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం శ్రీను కారులో జంగారెడ్డిగూడెం వెళుతుండగా, తాడువాయి షుగర్ ఫ్యాక్టరీకి సమీపంలో కల్వర్టు వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొందన్నారు. ఈ ఘటనలో తలకు బలమైన గాయం కావడంతో శ్రీనును స్థానిక ఏరియా ఆసుపత్రి తీసుకువెళ్లగా, అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. శ్రీను భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

తోళ్ల పరిశ్రమలను పునఃప్రారంభించాలి

ఏలూరు (టూటౌన్): తెలుగు రాష్ట్రాల్లో మూత పడిన తోళ్ల పరిశ్రమలు, చర్మాలు కొనుగోలు కేంద్రాలు పునఃప్రారంభించాలని చర్మకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి పాలిమేర హరికృష్ణ ప్రభుత్వాలను కోరారు. త్వరలో జాతీయ చర్మకారుల సదస్సు ఏలూరులో నిర్వహించనున్నట్టు చెప్పారు. స్థానిక గన్ బజార్‌లోని సంఘ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సదస్సు సన్నాహక సమావేశంలో హరికృష్ణ మాట్లాడారు. చర్మకారులు, డప్పు కళాకారుల ఇబ్బందులు వెల్లడించేందుకు సదస్సు నిర్వహిస్తామన్నారు. సదస్సు పోస్టర్ విడుదల చేశారు.

జ్వరాలతో వణికిపోతున్న జనం

- డెంగీ పేరుతో ప్రైవేటు ఆసుపత్రుల వసూళ్లు
- చర్యలు తప్పవంటున్న జిల్లా వైద్యాధికారులు


ఇటీవల తణుకులోని ప్రైవేటు ఆసుపత్రిలో తనిఖీలు చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు (ఫైల్)

తణుకు: సాధారణ జ్వరం వస్తే చాలు జనాలు భయపడిపోతున్నారు. కేవలం జ్వరానికే రూ. లక్షలు వసూలు చేస్తున్న ప్రైవేటు ఆసుపత్రులకు ప్రస్తుతం ‘సీజన్‌’ నడుస్తోంది. ఇటీవలి కాలంలో జిల్లాలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇదే సాకుతో కొందరు ప్రైవేటు ఆసుపత్రి యాజమాన్యాలు డెంగీ సోకిందంటూ రోజుల తరబడి ఆసుపత్రిలో ఉంచి తర్వాత పెద్ద మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారు. ఇదే సమయంలో లాబొరేటరీలకు కాసుల వర్షం కురుస్తోంది. లాబొరేటరీలతో కుమ్మక్కవుతున్న ప్రైవేటు వైద్యులు అనవసరమైన పరీక్షలు చేయిస్తూ రూ. వేలు గుంజుతున్నారు. అంతేకాకుండా ప్లేట్‌లెట్స్ తగ్గాయని డెంగీ సోకిందని భయపెట్టి మరీ ఫీజులు వసూలు చేస్తున్నారు. ఇటీవల అత్తిలి పట్టణానికి చెందిన యువకుడికి డెంగీ సోకిందంటూ తణుకులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేసిన వైద్యుడు చివరికి చేతులెత్తేయడంతో మరో ప్రైవేటు ఆసుపత్రికి తరలించినప్పటికీ నయం కాకపోగా ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటనపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు విచారణ చేసి ఆసుపత్రి వైద్యుడి నిర్లక్ష్యం కారణంగానే యువకుడు మృతి చెందాడని నిర్ధారించి మూడు నెలల పాటు ఆసుపత్రి లైసెన్సును సస్పెండ్ చేశారు.

కిటకిటలాడుతున్న ఆసుపత్రులు...

గత కొద్ది రోజులుగా కురిసిన వర్షాలు... మరోవైపు పెరుగుతున్న చలిగాలులు ఈ సమయంలో వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఇదే సమయంలో ప్రజలు జ్వరాల బారిన పడుతుండగా డెంగీ ప్రబలుతోంది. వీటి బారిన పడిన కొందరు ఇటీవల మృత్యువాత పడ్డారు. తణుకులోని పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో మాత్రం పదుల సంఖ్యలో రోగులు చికిత్స పొందుతున్నారు. జ్వరం వచ్చిందంటే చాలు... డెంగీ ఏమోనని ప్రజలు భయపడిపోతున్నారు. సాధారణ జ్వరం వస్తే చాలు అటు ప్రభుత్వాసుపత్రి వైద్యులైనా లేదా ప్రైవేటు ఆసుపత్రి వైద్యులైనా అన్ని రకాల రక్త పరీక్షలు చేయించాలని ఒత్తిడి తీసుకువస్తున్నారు. మరోవైపు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పీఎంపీలు సైతం సాధారణ జ్వరానికే రక్తపరీక్షలు చేయించి డెంగీ నిర్ధారించడం ఆందోళన కలిగిస్తోంది. ఇదిలా ఉంటే పీఎంపీలు కమీషన్ల కోసం డెంగీ అంటూ భయపెడుతూ ప్రైవేటు ఆసుపత్రులకు రిఫర్ చేస్తూ సొమ్ములు దండుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. డెంగీతో ఆసుపత్రుల్లో చేరిన రోగులకు రోజుకు రెండు సార్లు రక్త పరీక్షలు చేయించాలని వైద్యులు సూచిస్తుండటంతో ప్రైవేటు లేబొరేటరీలకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఒక్కో పరీక్షకు రూ. వెయ్యి నుంచి రూ. 1500 వరకు గుంజుతున్నారు. నిబంధనల ప్రకారం డెంగీ, మలేరియా వంటి పరీక్షలు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో చేయించి నిర్ధారించాల్సి ఉంటుంది. డెంగీ నిర్ధారణ కోసం జిల్లా కేంద్ర ఆసుపత్రిలోఎలీసా పరీక్ష చేయించాలి. అయితే ప్రైవేటు ఆసుపత్రి వైద్యులు మాత్రం కాసులకు కక్కుర్తి పడి డెంగీ నిర్ధారిస్తున్నారు. ఇలా ఒక్కో రోగి నుంచి రూ. 40 నుంచి రూ. 70 వేలు వరకు వసూలు చేస్తున్నారు.

డెంగీ నిర్ధారిస్తే చర్యలు...

ప్రైవేటు ఆసుపత్రి వైద్యులు లేదా ప్రైవేటు లాబొరేటరీలు డెంగీ నిర్ధారిస్తే చర్యలు తీసుకుంటాం. జిల్లాలో ఎక్కడైనా డెంగీ అనుమానిత రోగి ఉంటే జిల్లా వైద్యాధికారులకు సమాచారం అందిస్తే ప్రత్యే బృందాన్ని పంపించి రక్తనమూనాలు సేకరిస్తాం. ఇలా కాకుండా ప్రైవేటు వైద్యులు, పీఎంపీలు సైతం డెంగీ నిర్ధారిస్తున్నట్లు సమాచారం ఉంది. తణుకులోని ఒక ప్రైవేటు ఆసుపత్రి లైసెన్సును మూడు నెలల పాటు సస్పెండ్ చేశాం.

– డాక్టర్ భానునాయక్, అడిషినల్ డీఎంఅండ్‌హెచ్‌వో, భీమవరం

క్లుప్తంగా

ముద్దాపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


ముద్దాపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

తణుకు టౌన్: మండలం ముద్దాపురం గ్రామంలో రాష్ట్ర పౌర సరఫరాలు శాఖ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ప్రారంభించారు. శనివారం ముద్దాపురం గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన 2024–25 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి, ఎంపీటీసీ కె కృష్ణవేణి, జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వరరావు, సివిల్ సప్లయ్ మేనేజర్ టీ శివరామప్రసాద్, తహసిల్దార్ డీవీఎస్ఎస్ అశోక్ వర్మ, రెవిన్యూ, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వీరంపాలెంలో కార్తీక మాసోత్సవాలు ప్రారంభం


వీరంపాలెం శైవక్షేత్రంలోని శ్రీవిశ్వేశ్వరస్వామిని విశేషంగా అలంకరించిన దృశ్యం

తాడేపల్లి గూడెం రూరల్: మండలంలోని వీరంపాలెం శ్రీబాలాత్రిపుర సుందరీ పీఠంలో శనివారం నుంచి కార్తీక మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పీఠం వ్యవస్థాపకులు గరిమెళ్ళ వెంకటరమణ శాస్త్రి పర్యవేక్షణలో విశ్వేశ్వర స్వామి వారికి నిత్య పూజలతో పాటు ప్రత్యేక పూజలను ఆలయ అర్చకులు నిర్వహించారు. కార్తీక మాసం తొలి రోజు కావడంతో భక్తులు విరివిగా తరలివచ్చి విశ్వేశ్వరుడిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వినియోగం చేశారు.

విద్యార్థికి అభినందనలు


జెడ్పీ హైస్కూల్‌లో అభినందన కార్యక్రమం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలలో పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి పి.యదిద్య (10వ తరగతి) జిల్లా ప్రథమ స్థానం సాధించారు. భీమవరం డీఎస్పీ చేతుల మీదుగా మెమెంటో, రూ 5 వేలు నగదు బహుమతి అందజేశారు. పాఠశాల తరుపున శనివారం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం సత్యనారాయణ, ఎన్‌సీసీ విభాగం తరపున కేవీ గణపతిరావు, తల్లిదండ్రులు అభినందించారు.

మదనగోపాలస్వామి ఆలయంలో విశేష పూజలు


మదనగోపాలస్వామి ఆలయంలో పూజలు

అత్తిలి: జిల్లాలో వైష్ణవ క్షేత్రాలలో ప్రసిద్ధి గాంచిన బల్లిపాడు మదనగోపాలస్వామి ఆలయంలో శనివారం గోవర్ధన గిరి ప్రత్యేక పూజా కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. మరిగంటి శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈపూజా కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో మహిళలు హాజరయ్యారు. ఉదయం విశ్వక్సేన ఆరాధన, విగ్రహ సంప్రోక్షణ, కలశారాధన, విగ్రహ తిరుమంజనం, అలంకారం, అష్టోత్తర పూజ, ద్రవిడ వేదపారాయణం కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎల్ఎల్ శ్రీనివాసరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

5న ఎంపీడీవో కార్యాలయంలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

భీమవరం: భీమవరం ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 5వ తేదిన ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి లోకమాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో అమరరాజా గ్రూప్, జగదీష్ మెరైన్ ఎక్స్‌పోర్ట్స్ కంపెనీల్లో మిషన్ ఆపరేటర్స్, సూపర్‌వైజర్, క్వాలిటీ కంట్రోల్ వంటి విభాగలలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నామన్నారు. 18–35 ఏళ్ల వయస్సు కల్గిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులని కంపెనీల నియమాలను అనుసరించి ఎంపిక చేస్తారని,నిరుద్యోగ యువతి యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని లోకమాన్ తెలిపారు. ఇతర వివరాల కోసం సెల్: 94418 41622 నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

అక్రమ గ్యాస్, పీడీఎస్ రైస్ నిల్వలపై దాడులు


మసీదు సెంటర్‌లో గ్యాస్ నిల్వలపై తనిఖీ చేసిన తహసీల్దార్ సునీల్‌కుమార్

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణంలోని 9, 10, 16వ వార్డులతో పాటు గణేష్ జేకే. రెస్టారెంట్‌లపై శనివారం తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్ ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా డొమెస్టిక్ సిలిండర్ల నుంచి గ్యాస్‌ను చిన్న సిలిండర్లలోకి ఎక్కిస్తున్న నేరంపై గజ్జవరపు శ్రీరామ్మూర్తి నుంచి మూడు, బెజవాడ ప్రసాద్ నుంచి ఏడు, తోట రాము నుంచి ఐదు, జేకే రెస్టారెంట్‌లో ఒకటి, మాయాబజార్ రెస్టారెంట్‌లో మూడు గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ సునీల్‌కుమార్ వివరించారు. అలాగే, 16వ వార్డులో పీడీఎస్ రైస్ కొనుగోలు చేసి, మోటారు సైకిల్‌పై తరలిస్తున్న మానినీడి శ్రీనివాస్‌పై 6ఏ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ కే.శివప్రసాద్, రెవెన్యూ కార్యదర్శులు చిట్టిబాబు, వంశీ, కాంతం, మురళీ, సత్యనారాయణ, సురేష్ తదితరులు ఉన్నారు.

గుంతల పూడికకు చర్యలు


మాట్లాడుతున్న మునిసిపల్ ఆర్‌డీ నాగనరసింహారావు

తాడేపల్లిగూడెం: ఈ ఏడాది డిసెంబర్ 15 నాటికి పురపాలక సంఘాల పరిధిలోని రోడ్లపై గుంతలు లేకుండా చర్యలు చేపట్టినట్టు మునిసిపల్ రాజమండ్రి ప్రాంతీయ సంచాలకులు సీహెచ్.నాగనరసింహారావు తెలిపారు. శనివారం మునిసిపల్ కార్యాలయ సందర్శనకు వచ్చిన ఆయన కమిషనర్ వివిధ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి మునిసిపల్ పరిధిలోని రోడ్లపై గుంతలు లేకుండా చేయడానికి చేపట్టిన పనులు డిసెంబర్ 15 నాటికి పూర్తవుతాయన్నారు. గూడెం పట్టణానికి సంబంధించి సాలిడ్ వేస్టుమేనేజ్‌మెంటు, నూరుశాతం డ్రైయిన్లలో సిల్టు తొలగింపు విషయాలపై సమీక్షించారు. కుక్కల సంతతి నివారణలో భాగంగా సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అనుసరించి వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్, ఆపరేషన్ థియేటర్ నిర్మాణం, కెన్నెల్స్ ఏర్పాటు, ఏజన్సీ నియామకం వంటి విషయాలపై మాట్లాడమన్నారు. 15,16 ఆర్థిక సంఘ నిధులు, అమృత్ నిధుల ద్వారా ప్రతి ఇంటికి కుళాయిల ద్వారా మంచినీటి సరఫరాకు అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో కమిషనర్ ఎం.ఏసుబాబు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మురుగు కాలువల అభివృద్ధికి చర్యలు

కాళ్ల: మురుగు కాలువల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని స్థానిక ఎమ్మెల్యే కనుమూరి రఘురామ కృష్ణంరాజు తెలిపారు. పెద అమీరం గ్రామంలో మురుగుకాలువ అభివృద్ధి పనులను శనివారం ప్రారంభించారు. మురుగు కాలువలు అభివృద్ధి చేయడం వల్ల రైతులకు ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. పెద అమీరం నుంచి సుమారు ఏడు కిలోమీటర్ల మేర ఉన్న మురుగు కాలవ అభివృద్ధి పనులను చేస్తున్నట్లు డీఈ రుద్ర నరసింహ అప్పన్న,ఏఈ జయప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు, కటారి నరసింహారాజు, ఉపసర్పంచ్ జవ్వాది కిషోర్, కోరా రామ్మూర్తి తోట ఫణి బాబు, సిబ్బంది గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మాలల మహాగర్జన సభను విజయవంతం చేయండి


పోస్టర్లు విడుదల చేస్తున్న మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మాలల మహాగర్జన సభను విజయవంతం చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, మాల సంఘాల జేఏసీ గౌరవాధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. పట్టణంలో జరిగిన సమావేశంలో మంగరాజు మాట్లాడుతూ హలో మాల, చలో నాగార్జున యూనివర్సిటీ (గుంటూరు) పోస్టర్లను ఆవిష్కరించారు. మంగరాజు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును పునఃపరిశీలించాలన్నారు. నవంబర్ 26వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు గుంటూరు జిల్లా నాగార్జున యూనివర్శిటీ ఎదురుగా ఉన్న బైబిల్ మిషన్ గ్రౌండ్స్‌లో మాలల గర్జన సభ జరుగుతుందని చెప్పారు. తెలంగాణాలో ఉన్న మాలలు సైతం పెద్ద ఎత్తున సభను జయప్రదం చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ క్రిమిలేయర్‌ను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షులు భేతాళ శరత్ బాబు, నాయకులు మందా విజయ ప్రసాద్, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలి


తణుకులో విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: విద్యార్థినులు తమ భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలంటే క్రమ శిక్షణ, సమయ పాలన ఎంతో ముఖ్యమని తణుకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్ కొండయ్య చెప్పారు. శనివారం సాయంత్రం తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాలలో నిర్వహించిన పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా తణుకు మానవత సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ఇంటర్, డిగ్రీ, పీజీ కళాశాలలవిద్యార్థులకు నిర్వహించిన × సైబర్ నేరాలు నుంచి రక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలు । అనే అంశంపై వ్యాస రచన పోటీలలో విజేతలైన వారికి బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్స్ యూ లక్ష్మీసుందరి బాయి, బీహెచ్ హిమబిందు, వీవీవీ సత్యనారాయణరెడ్డి, మానవత జిల్లా కన్వీనర్లు బీ రామలక్ష్మీ, ఎస్‌వీ సతీష్ బాబు, సభ్యులు పీ శివన్నారాయణ, సుబ్రహ్మణ్యం, విశ్వనాథరాజు, పులమాల భద్రం, ఎన్ గోవర్ధని తదితరులు పాల్గొన్నారు.

నేడు అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు

తణుకు అర్బన్: కార్తీక మాసం సందర్భంగా తణుకు జాతీయ రహదారి సమీపంలో వేంచేసియన్న శ్రీశాస్త్ర పంచాయతన శ్రీఅయ్యప్ప దేవాలయంలో ఆదివారం ఉదయం 3.30 గంటలకు చిట్టూరి రుష్యంత్, పచ్చిపులుసు, గంటా తరుణ్ స్వాములచే గణపతి పూజ, అయ్యప్పస్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించబడునని నిర్వాహకులు తెలిపారు. ఆలయ గురుస్వాములు చలపతి, చల్లా భరణి ఆధ్వర్యంలో ఉదయం 7 గంటలకు మూల మంత్ర హోమాలు, 9 గంటలకు దిగ్బలిహరణము, 10 గంటలకు అమలక (ఉసిరి) స్వరూప లక్ష్మీనారయణులకు షఢ్షడశోపచారములు భాగ్యశ్రీ హాస్పట్ వైద్యులు డాక్టర్ ఎస్ సూర్యప్రకాష్, రేఖ దంపతులచే నిర్వహిస్తామని చెప్పారు. ఉదయం 11 గంటలకు అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో 10 వేలకు పైగా భక్తులకు అన్నసమారాధన నిర్వహించనున్నట్లు వివరించారు.

94 మందికి ఉచిత వైద్యసేవలు


తణుకులో ఉచిత వైద్యశిబిరంలో వైద్యసేవలందిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: స్థానిక రైల్వే గేటు ప్రాంతంలోని స్పందన ప్రథమ చికిత్స కేంద్రంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో తణుకుకు చెందిన జేకే హాస్పిటల్ వైద్యులు డాక్టర్ అశోక్‌కుమార్ దేవరకొండ, డాక్టర్ హరికృష్ణ పేదలకు వైద్యసేవలందించారు. శిబిరానికి హాజరైన 94 మందికి ఉచితంగా వైద్యసేవలతోపాటు బీపీ, సుగర్, ఈసీజీ పరీక్షలతోపాటు గుండెకు సంబంధించి, ఛాతీలో నొప్పి, శ్వాసకోస వ్యాధులు, కళ్లు తిరగడం, తల తిరగడం, గ్యాస్ట్రిక్ సమస్యలకు సంబంధించి ఉచితంగా ల్యాబ్ టెస్టులు నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన పేదలకు ఆహార అలవాట్లు, నిత్య వ్యాయామం, నడక వంటి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

రైతులకు గిట్టుబాటు ధర ప్రకటించాలి


రేలంగి గ్రామంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఇరగవరం: రైతులకు గిట్టుబాటు ధర ప్రకటించాలని సీపీఎం సభ్యులు జుత్తిగ నరసింహమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఇరగవరం మండలం రేలంగి గ్రామంలో సీపీఎం పార్టీ ఆరో మహసభ ఇల్లిందల పర్తి సత్య నారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలు చేకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందరి ఆరోపించారు. కొనుగోలు కేంద్రాలో ప్రభుత్వం ఏర్పాటు చేయలేదని రైతులు తూసే ధాన్యముల్లో మోసాలు అరికట్టాలని డిమాండ్ చేశారు. సీపీఎం పార్టీ ప్రజల పక్షాన పోరాడి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల సిపిఎం కన్వీనర్ కామన మునిస్వామి గత మూడు సంవత్సరల్లో చేసిన కార్యక్రమలను వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఆంజనేయులు, జోగి సత్యనారాయణ, జోగి సాయి దంపనబోయిన విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

దుంపగడపలో ఏకాసన సుందర కాండ పారాయణ

ఆకివీడు: లోక కల్యాణార్థం ఏకాసనలో సుందర కాండ పారాయణం కార్యక్రమం శనివారం మండలంలోని దుంపగడప గ్రామంలో నిర్వహించారు. గ్రామంలోని ప్రముఖ సిద్ధాంతి పిన్నమరాజు వెంకట రవి వర్మ నివాసం వద్ద కార్తీక మాసం సందర్భంగా సుందర కాండ పారాయణం 68 సర్గల్‌ను ఉదయం 8 గంటల నుండి సాయింత్రం 8 గంటల వరకూ ఏకథాటిన హైదరాబాద్‌కు చెందిన గోపాల కృష్ణ శర్మ పారాయణం చేశారు. అనంతరం స్థానిక రామాలయంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద అగ్నిప్రమాదం


మంటలను అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది

తాడేపల్లిగూడెం అర్బన్: తాడేపల్లిగూడెం వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన తాటాకు పందిరిపై దీపావళి సందర్భంగా వేసిన తారాజువ్వ పందిరిపై పడటంతో శనివారం రాత్రి మంటలు చెలరేగాయి. వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద తాటాకు పందిరికి మంటలు చెలరేగడాన్ని గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందజేయడంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ప్రమాదం సంబవించిన సమయంలో పార్టీ కార్యాలయంలో ఎవరూ లేకపోవడంతో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

దివ్యాంగుల పిల్లలకు డిజిటల్ విద్య


దివ్యాంగునికి ఇంటి వద్ద శిక్షణ ఇస్తున్న బాలీశ్వరయ్య

తాడేపల్లిగూడెం (టీఓసీ): సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో అతి తీవ్ర వైకల్యం కలిగి పాఠశాలకు రాలేని దివ్యాంగుల పిల్లలకు ప్రతి శనివారం డిజిటల్ విద్య అందజేస్తున్నట్లు భవిత సెంటర్ విలీన ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి శనివారం తీవ్ర అంగ వైకల్యం ఉన్న వారి ఇంటికి వెళ్లి ట్యాబ్ ద్వారా జల్లో యాప్, ఇతర యాప్స్‌ను ఉపయోగించి దివ్యాంగుల పిల్లలకు లైఫ్ స్కిల్స్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. దివ్యాంగుల పిల్లలకు శిక్షణతో పాటు అవసరమైన ఉచితంగా ఉపకరణాలు అందజేస్తున్నట్లు వెల్లడించారు. నడవలేని పిల్లలకు ఫిజియోథెరపీ, సమగ్ర శిక్ష ద్వారా దివ్యాంగుల పిల్లలకు కల్పిస్తున్న సదుపాయాలు వెల్లడించారు. తల్లిదండ్రులు తప్పక సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

లోక్ అదాలత్ విజయవంతానికి కృషి చేయాలి

నరసాపురం: జాతీయ లోక్‌అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా పోలీసు అధికారులు కృషి చేయాలని నరసాపురం జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీనివాస్ సూచించారు. డిసెంబర్ 14న జరగనున్న లోక్ అదాలత్ నిర్వహణపై శనివారం కోర్టుహాల్లో పోలీసు అధికారులతో జడ్జి శ్రీనివాస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్ కేసులు, వాటిలో రాజీ పడదగిన కేసులు గుర్తించి ఇరుపక్షాలకు కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు.

లయన్స్ సేవలు అభినందనీయం

ఇరగవరం: మండలంలోని తూర్పు విప్పార్రు గ్రామంలో శనివారం ఉజ్వల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని గ్రామ సర్పంచ్ తమ్మిశెట్టి సత్యనారాయణ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 70మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు అందజేశారు. క్యాన్సర్ భారీన పడిన వారిని మెరుగైన చికిత్స కోసం పెద్ద ఆసుపత్రికి రిఫర్ చేయడం జరిగిందన్నారు. గ్రామాల్లో జరుగుతున్నా వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లైయన్స్ మాజీ గవర్నర్ మాణిక్యాలరావు, లయన్స్ మహిళ డీసీ మాదిరెడ్డి కృష్ణ కుమారి, మాజీ సర్పంచ్ ఆకేటి నరసింహరావు, ఇరగవరం జనసేన మండల అధ్యక్షులు ఆకేటి కాశీ, ఉజ్వల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మారేడి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

జనవరిలోగా గుంతల పూడికలు

పెంటపాడు: జనవరిలోగా అన్ని రహదారులను పూర్తిగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆయన ప్రత్తిపాడు వద్ద నిడదవోలు– గూడెం రహదారిలో ప్రత్తిపాడు వద్ద గోతులు పూడ్చే కార్యక్రమంలో భాగంగా ఆయన శంకుస్థాపన పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

102 మందికి ఉచిత రక్త పరీక్షలు


రక్త పరీక్షల శిబిరంలో పాల్గొన్న లయన్స్‌క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం సేవా కార్యక్రమాలలో భాగంగా అధ్యక్షుడు వీవీఎస్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో శనివారం కడకట్ల జనతా ఆసుపత్రి చారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో ఉచిత సుగర్ వ్యాధి రక్త పరీక్ష శిబిరం జరిగింది. లయన్ వంగపండు రామమోహన్‌రావు ఆర్థిక సహకారం అందజేశారు. డాక్టర్ ఆర్ దామోదర్ రెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ మధు చైతన్య, డాక్టర్ స్నేహ రెడ్డిలు హాజరైయారు. శిబిరంలో 102 మందికి రక్త పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను అందజేశారు.

డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన


డిజాస్టర్ మేనేజ్మెంట్ పై అవగాహన

తాడేపల్లిగూడెం (టీఓసీ): సత్యసాయి బాబా సంస్థ సత్య సాయి ఫ్యాకల్టీలతో శనివారం పట్టణంలోని జీఎంఆర్ వాసవి డిగ్రీ కళాశాలలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వైజాగ్ స్టేట్ ఫ్యాకల్టీ రమేష్, విజయవాడ నుంచి సాయి ప్రదీప్, ఒంగోలు నుంచి బాలాజీ, కాకినాడ నుంచి బుల్లబ్బాయి, నూజివీడు నుంచి రాజశేఖర్, కర్నూలు నుంచి నిమ్మి , జిల్లా ఇంచార్జి హరి, సేవదళ్ ఇంచార్జి జనార్దన్ రావు, కోఆర్డినేటర్ అనిల్‌కుమార్, గ్రంధి సాయి సుబ్రహ్మణ్యం తదితరులు మాట్లాడారు.